# బంధం

**అనుకున్నవి జరుగకపోడం, చేయాలనుకున్నవి చేయలేకపోవడం, ఆశయాలు ఆచరణలో పెట్టలేకపోవడమే జీవితం. అది మనిషి అసమర్థత అంటారు కొందరు. అది అసమర్థత కాదు జరిగిన పొరపాట్లను సమర్థించుకోవడమే. ఇదీ జీవితం అని తృప్తి పడటమే.**

ఆలోచనల్లో మునిగిపోయి పడక కుర్చీలో కూర్చుని వారపత్రిక చదువుతున్నాను. మనసు పుస్తకం మీద లేదు.

'నామ్మా–' ఎదురుగా చూశాను.

నా చిట్టి మనవడు. వాడి వెనకాలే వాడి తండ్రి నా గారాల ఏకైక కొడుకు.

'నామ్మా' అంటూ వొడిలో చేరి, చేతిలో పుస్తకం ప్రక్కన విసిరేసి, కళ్ళజోడు తీసి ప్రక్కనే పడేసి, నా కళ్ళల్లోకి చూస్తున్నాడు. చిట్టికన్న, వాడు వచ్చాక నేను వేరే ఏ పనీ చేయకూడదు, వాడితోనే కాలక్షేపం చేయాలి.

వాడికి నన్ను చూడగానే భక్తుడు, దేముడు కనిపిస్తే ఎంత తన్మయత్వంతో, అమితానందంతో చూస్తాడో, అలాగే నేను కూడా అపురూపమైన వస్తువును చూసినట్లుగా నా గుండెల నిండుగా ఆనందం నిండిపోయింది.

'అమ్మా, నేను అలా వెళ్ళి వస్తాను. ఒక అరగంట వాడితో ఆడుకో, మళ్ళీ వచ్చి తీసుకువెళ్తాను'.

టేబుల్ దగ్గర కూర్చుని పేపర్ చదువుకుంటున్న ఆయన ఈ తతంగమంతా క్రీగంట చూస్తున్నారు. 'అలాగే వెళ్ళిరా' వాడు వెళ్ళిపోయాడు.

మా పెళ్ళయ్యాక మొదటి రాత్రి 'ఏమోయ్ ! మనకు ఎంతమంది పిల్లలు? అన్నారాయన చిలిపిగా.

అందుకు నేను 'మొదట మగపిల్లాడైతే ఒక్కడే, ఆడపిల్లలైతే, మగ పిల్లాడు కలిగే వరకు మీరు కష్టపడాల్సిందే'–అన్నాను.

10

" ఓ.కే. అన్నారాయన " -

'అనుకున్నట్లుగానే మొదటి వీడు పుట్టాడు. ఎర్రగా బుల్లిగా, నా అందం, ఆయన పర్సనాలిటీ కలబోసుకొని పుట్టాడు వాడు. నాకు చెప్పకుండానే ఆయన పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నారు. ఆ తరువాత

వాడు ప్రాకడం దగ్గర నుండి, బుడి బుడి నడకలు నడిచేవరకూ, చదువులో ఒక్కో మెట్టు ఎక్కేవరకూ, రకరకాల ఊహలు, ఆలోచనలు, ఆశయాలు, ప్రణాళికలు.

'ఏమండీ బాబుకి పెళ్ళయ్యాక మనందరం కలిసి వుండాలి. మంచి కోడలిని చూసి తెచ్చుకుందాం! బీదింటి పిల్లయితే మరీ మంచిది' అనే దాన్ని.

'పిచ్చి. ప్రేమాభిమానాలకు, గొప్ప బీద వుండవే. అసలు మనిషిలో అవి పుట్టాకే బీద గొప్ప వస్తాయి' అనే వారు ఆయన.

ఇలా ఆలోచిస్తుండగానే వాడు ఇంజనీరు అయ్యాడు. గొప్ప, బీద కాకుండా మధ్య తరగతి అమ్మాయితో వివాహం అయింది.

నా ఆశయాల పేక మేడకు ఈదురుగాలి కొట్టింది. 'అత్తగారు, మామగారు వున్న చోట మనకు స్వాతంత్ర్యం వుండదు. వేరే వెళ్దాం' అని మూడు రాత్రుళ్ళు శోభనం తరువాత నాకన్న తండ్రిని ఎగరేసుకుపోయింది.

మగ పిల్లవాడు పుట్టాడని ఎంతో సంబరంతో ముఖ్యంగా తల్లి కొడుకుని, తన కనుసన్నల నుండి క్షణం కూడా మరుగు కాకుండా పెంచుతుంది. అనుక్షణం వాడికి ఏంకావాలి, ఏవి ఇష్టం, ఎలా పెంచాలి సంఘంలో అందరి మగపిల్లలకన్నా పెద్ద వాడిని చేయాలి అని ఎన్నో ఆశలతో ఆశయాలతో వాడిని పెంచుతుంది.

ఈలోగా పెద్దవాడై ఉద్యోగం వచ్చాక పెళ్ళి అవుతుంది.

అతనికి ఇష్టమైన అమ్మాయి భార్య అయి జీవితంలో ప్రవేశిస్తుంది. ఒకవేళ పెళ్ళికి ముందు ఇష్టం లేకోపోయినా తరువాత ఆమెఅతని ప్రాణం అయిపోతుంది.

అయితే

ఈ ప్రక్రియలో అతను తల్లిని కొంతకాలం మర్చిపోతాడు. కన్నతల్లి ఇది సహించలేదు.

అంతవరకూ తనని అంటి పెట్టుకొని, తన మీదే ప్రతీదానికి ఆధారపడ్డ కొడుకుని, కొత్తగా వచ్చిన కోడలు తన నుండి తన కొడుకుని విడదీసిందని, తనను మరిపించిందనీ,

సామాన్యంగా ఆమె మీద అత్తగారికి పెళ్ళి అయిన మర్నాటినుండి కోపం అసూయ వుంటాయి. మరి తన కొడుకు కొత్తగా పెళ్ళి అయి తనను నమ్ముకున్న అమ్మాయిని వదిలేసి తల్లిని పట్టుకుని ఇంకా వ్రేలాడాలా?

ఇక్కడ అతని తల్లి, భార్య కొంచెం సంయమనం పాటిస్తే సమస్య వుండదు. కాని ఇద్దరూ స్త్రీలే కావడంతో సంయమనం పాటించడం సాధ్యం కాదు.

' అమ్మ నాన్న గారికి చెప్పడానికి భయంగా వుంది. మేము వేరే ఇల్లు చూసుకున్నాం. వెళ్ళిపోతున్నాం. తనకు ఇక్కడ వుండటం భయంగా వుంటుంది అంటుంది. నాన్నగారు ఆఫీసు నుండి వచ్చాక చెప్పు - అని పెళ్ళీతో వెళ్ళిపోయాడు వాడు.

' పిచ్చీ - అందరూ కలసి ఒకే ఇంట్లో వుంటే, దగ్గర దగ్గరగా వున్నా సరే ఒకరి నొకరు ద్వేషించుకునే కన్నా, దూరంగా వేరే వుండి ఎప్పుడైనా కలుసుకుని మనసారా మాట్లాడుకోవడమే మంచిదిరా. అదీ మన మంచికే. భాధ పడకు అని సముదాయించారు నన్ను. ఎంతటి కష్టం కలిగించే విషయమైనా సరే, బాధ కలిగించే సంఘటననైనా సరే గరళ కంఠునిగా భరించడం ఆయన అలవాటు చేసుకున్నారులా వుంది. నాకు కుదరడం లేదు.

ఆనాటి నుండి

నాకు ఆయనా-

ఆయనకు నేనూ-

ఒకరి నొకరం కొడుకూ కోడలు ఏం చేస్తుంటారు అనుకుంటూ, ఊహాల్లో విహరిస్తూ కాలక్షేపం చేస్తుంటారు.

మానిత్యభోజనంలో 'పిండివంటలు' వాళ్ళ గురించిన ఆలోచనలే. వాళ్ళ కబుర్లే మా కడుపు నింపేవి ఎక్కువ భాగం, మరో ప్రక్క ముల్లు లాగా వాళ్ళు నా దగ్గర వుండలేదేనన్న బాధ పొడుస్తున్నా సరే.

ఈలోగా - మా కోడలు

పండంటి బాబును కన్నది

హాస్పటిల్లో నా మనవణ్ణి చూద్దామని వెళ్ళి గ్లాక్సో బేబీ లాంటి బాబును ఎత్తుకుందామని, ఉయ్యాలవేపు చేతులు వేస్తున్న నన్ను కోపంతో చూస్తూవాడు ఇప్పుడే నిద్రపోయాడు లేపకండి' అని నన్ను గుఱ్ఱుగా చూస్తూ కసిరింది కోడలు.

అవును-నిజమే-

నా ప్రక్కనే వున్న ఆయన, నన్ను కను సన్నలతో కోపంతో చూస్తున్నారు' జరిగిన సన్మానం చాలులే పద ' అన్నట్టుగా -

అప్పటి నుండి

మా అబ్బాయే ఎప్పుడైనా నాకోసం నా మనవణ్ణి, తన భార్యకు తెలియకుండా నా దగ్గరకు తీసుకు వచ్చి ఒక అరగంట విడిచి వెళ్తుంటాడు. తల్లి ఋణం తీర్చుకునే ఏర్పాటు తను ఇలా చేసుకున్నాడేమో.

' నామ్మా ఏంతి కంతో నలక పడిందా? అంటూ చిన్నారి చేతులతో నా కళ్ళు తుడుస్తున్నాడు.

చిట్టికన్న- తాతగారి పోలిక

కోటేరు లాంటి ముక్కు-పెద్ద కళ్ళు, గుండ్రని ముఖం, గాలి ఊదినట్లు వుండే బుగ్గలు, చిన్ని నోరు, ముఖం నిండా కాంతి, వాడి తెల్లని ముఖానికి నల్లని చిలాయి బొట్టు అందాన్నిస్తోంది. వాడి ముఖంలో కాంతి

వశీకరణ శక్తి

వాడిని చూస్తే పరవశంతో, నా శరీరం ఊగిసలాడుతోంది.

ఏమిటో అనుబంధం?

నేను కొడుకుని కనడం నేరమా?

ఆ కొడుక్కి పెళ్ళి చేయ్యడం తప్పా?

ఆ తరువాత మనవడు పుట్టడం

ఆ మనవణ్ణి నేను ఆడించడానికి, వాడితో ఆడుకోడానికి కూడా పనికి రానన్న నిబంధన ఏమిటి?

పాలల్లో పంచదార వేసి, అందులో అన్నం మెత్తగా పిసికి పెడితే ఎంతో అపురూపంగా తింటాడు చిట్టికన్న. ఆ అన్నం తినేటప్పుడు వాడి ముఖం చూస్తే ఎంతటి దుర్మార్గుడికైనా సరే దగ్గరకు లాక్కుని ముద్దులు కురిపించాలని వుంటుంది.

మూతి, చేతులు, శుభ్రంగా కడిగి, వాడిని నా గుండెలమీద పడుకోబెట్టుకుని, పడక కుర్చీలో వాడితో పాటుగా నేనూ నిద్రపోయాను.

' అత్తయ్యగారూ '-

కళ్ళు తెరిచి తల ఎత్తేను. మధుర స్వప్నం కరిగినట్లు

ఎదురుగా - కోపంతో ముఖం కందిపోయి నా కోడలు ఆమె చూపులకు శక్తి వుంటే

నేను ఏమయిపోయేదాన్నో

' ఈయన ఏరీ – '

' ఇప్పుడే బయటకు వెళ్ళాడమ్మా- '

' ఇక్కడకు ఎందుకు వచ్చారు! మీరు పిలిచారా ? '

' లేదు-లేదు-తానే వచ్చాడు -

' లేదులెండి మీరు పిలిచేవుంటారు-'

'---'

' నేను చెప్పినా సరే ఈయనకు నా మాటంటే లెక్కలేదు '

' పోనీలే అమ్మా-రేపటి నుంచి మా ఇంటికి రావద్దని చెప్తానులే – '

' అత్తయ్యగారూ – అర్థం లేని ప్రేమలు, అభిమానాలు వాడికి అలవాటు చెయ్యకండి. మేము అసలు కన్న తల్లిదండ్రులం కదా. మేము చూపించని అలవి కాని ప్రేమలు, ముద్దులు వాడిమీద కురిపించి, వాడికి పదేపదే కానుకలు కొని చ్చివాడిని మీ వశం చేసుకోకండి. వాడిని మీకు దూరం చేయకండి. – ' కోడలు చాలా కరుకుగా కత్తితో నా శరీరం మీద గాట్లు పెడుతూ, ఆ గాట్ల మీద మాటలనే సీమ మిరపకాయల కారం జల్లుతోంది. ఇదోక చిత్రవధ. పోలీసులు నేరస్తుణ్ణి ప్రశ్నించడం లాంటిది.

' అమ్మ-చిన్నప్పటి నుండీ, పొత్తిళ్ళలో ఎలకపిల్లలా ఉన్నవాణ్ణి, బ్రతుకుతాడో లేదోనని ఆందోళనతో, వాడిని ఇరవై సంవత్సరాలు కంటికి రెప్పలాగా కాపాడుకున్నాను. పెళ్ళి అయ్యాక వాడు నీ పరమై పోయాడు. ఇరవై ఐదు సంవత్సరాల అనుబంధం తెగిపోతుంటే నేను పడుతున్న బాధ ముందు, కనీసం సంవత్సరమైనా అనుబంధం లేని నీ కొడుకు నాకు మాలిమి అయిపోతాడని ఎందుకమ్మా ఆందోళన పడతావు ' నా కళ్ళ నిండా కారు మబ్బులు

' అత్తయ్యగారూ, మీరు నన్ను అపార్థం చేసుకోవద్దు. మీరు ఎంత కాలం బ్రతుకుతారో తెలియదు. వాడికి మీరు బాగా అలవాటు అయిపోయారనుకోండి తరువాత మీకు అకస్మాత్తుగా ఏదైనా అయిందనుకోండి, మరి మా అబ్బాయి మీ మీద బెంగతో ఏమైనా అయిపోతే మాగతేం కాను? మీకేం? మీరు మీదారిని హాయిగా మీరు పోతారు. అందుకని ఉభయుల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని వాడిని మీకు దగ్గర కాకుండా జాగ్రత్త తీసుకుంటున్నాను. ఇంత దూరం మీ అబ్బాయి ఆలోచించలేరు కదా –' కోడలు చెప్తోంది.

అవును-

నిజమే-!

నేను వయసు మళ్ళిన దాన్ని, ఎప్పుడు పోతానో నాకే తెలియదు. వయసులో

తప్పనిసరిగా బ్రతుకుతారనీ గ్యారంటీ బాండ్ దేముడు ఇచ్చాడా? ఏమో కోడలికి ఈ జన్మ రహస్యం తెలుసునేమో.

' తల్లి మీ అబ్బాయికి పెళ్ళి చేస్తావా? '

' అది మీకు అనవసరం నేను మా అబ్బాయిని ఎలా పెంచుకుంటానో, అప్పటి వరకు మీరు బ్రతుకుంటే, చూద్దురుగాని, కాని ఒకటి మాత్రం చెప్పగలను, మా అబ్బాయిని, మీరు మీ అబ్బాయిని పెంచినట్లుగా ముద్దపప్పులా మాత్రం పెంచను. '

' అవునమ్మా. నాకు ప్రేమ కురిపించడం తప్పితే నా మాట పూర్తి కాలేదు. నా గుండెలపై నిద్రపోతున్న పసివాడిని తీసుకొని -

' ప్రేమ, ప్రేమ-విసుగు పుట్టేస్తోంది. ఈ ప్రపంచంలో ప్రేమ కురిపించేసే తల్లి ఏకైక తల్లి ఈవిడే పుట్టింది మేము తల్లులం కాదు. ఇంటికి రానియ్ చెప్తాను. ఈసారి బాబు మీ ఇంటికి వస్తే ఆయనో నేనో తేలిపోవాల్సిందే - ' అనుకుంటూ చకచకా వెళ్ళిపోయింది. గుమ్మంలోనే ఎదురైన మా అబ్బాయి కోడలి వెంట పరుగులు పెట్టాడు. నేను పిలిచినా రాక పోవచ్చును.

అయినా-కొన్ని రోజుల్లో రాలిపోయే తల్లిదండ్రులకోసం, జీవితాంతం తనకు తోడుగా వుండాల్సిన జీవన సహచరిని వదులుకుంటారా ఎవరైనా?

పిచ్చికన్న-వాడిని అపార్థం చేసుకోకూడదు.

పుట్టిన వాళ్ళందరూ మరణం లేకుండా అలాగే ఉండిపోతే ఎంత బాగుండును అనిపిస్తుంది ఒక్కసారి

అప్పుడు

ప్రేమాభిమానాలు, ఆదరణలు, ఆప్యాయత, హృదయాల నిండా, నిండి వున్న మనుషుల మధ్యన శాశ్వత నివాసం ఏర్పరచుకోవచ్చును.

కాని

ప్రేమాభిమానాలు లేని -

ఇలాంటి వ్యక్తుల మధ్యన-

మరణం లేని జీవితం-

అమ్మో

అందువల్లనేమో-

భగవంతుడు ఈ మరణం అనే పరిణామాన్ని మనిషి జీవితంలో సృష్టించాడు. ఈ రిలీఫ్ లేకపోతే-

నాలాంటి దౌర్భాగ్యులు ఏమైపోతారు?

' పిచ్చీ బాధ పడకు

కోడలు సత్యాలు చెప్పింది.

శ్రీకృష్ణ భగవానుడు గీత బోధించినట్టు-

అభిమానం

ఆదరణ

ఆప్యాయత

అనురాగం

ప్రేమ

లాలింపు

ఇవి ఒక పిచ్చి చేష్టలు

ఆ పిచ్చిలో పడకు

పిచ్చిదానివైపోతావ్ !

అందుకే నిన్ను 'పిచ్చీ' అని ముద్దుగా పిలుస్తుంటాను. అంటూ నా భుజం తడుతూ ఆయన కండువాతో ముఖం తుడుచుకుంటున్నారు.

" భగవాన్ నా గుండెను బండరాయి చెయ్యవా! "

అంటూ నా మనసు ఘోషిస్తోంది.

***

---

బంధం విప్పి అంతరాంతరాల్లోకి చూచాను. అనుబంధాలూ, ఆత్మీయతలూ కాచి వడపోసిన వాళ్ళకు మాత్రమే సాధ్యమయ్యే చిక్కని రచన చేశారు. ఈవేళ వస్తున్న వేల కథలతో పోలిస్తే, మీ కథ నిజంగా అగ్రగణ్యం-

డా॥వి.వి.యల్.నరసింహారావు.